## క్లుప్తంగా

### విద్యార్థులూ.. కళాశాలకు రండీ

**శాయంపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న కొందరు విద్యార్థులు కళాశాలకు హాజరు కాకపోవడంతో అధ్యాపకులు వారి ఇళ్లకు వెళ్లి కళాశాలకు రావాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలకు రావడం ద్వారా ముఖ్యమైన ప్రశ్నలని గుర్తించవచ్చని, మంచి ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. వివిధ కారణాలతో ఇంటి దగ్గర ఉంటున్న విద్యార్థులు కళాశాలకు రావాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు నాంది ఈ నలభై రోజులేనని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునిల్‌కుమార్, వేణు, హిమబిందు, సౌజన్య పాల్గొన్నారు.

### ఓడీసీఎంఎస్ డైరెక్టర్‌గా లింగమూర్తి

**పరకాల :** వరంగల్ జిల్లా సహకార బ్యాంక్ సర్వసభ్య సమావేశంలో ఓడీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్‌గా మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి నియామకమయ్యారు. ఈ సందర్భంగా టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌తో పాటు డీసీసీబీ డైరెక్టర్‌లు, వివిధ సొసైటీల చైర్మన్‌లు సన్మానించారు.

### బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో బీరప్ప స్వామి విగ్రహ నిర్మాణానికి సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ రూ.30వేల విరాళాన్ని సోమవారం కమిటీ సభ్యులకు అందించారు. బీరప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కమిటీ చైర్మన్ మంతుర్తి రవి, వైస్ చైర్మన్ మిరియాల కుమార్, రమేశ్, సాంబయ్య, ఓదెలు పాల్గొన్నారు.

### కస్తూర్బాలో చెట్ల నరికివేత



**శాయంపేట :** మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లివచ్చారు. ఈ క్రమంలో సిబ్బంది చెత్తను చెట్ల వద్ద పోసి నిప్పుపెట్టడంతో చెట్లు కాలిపోయాయి. అలాగే పాఠశాల ప్రహరీ ఆనుకుని ఉన్న 15 టేకు చెట్లను నరికి వేశారు. ప్రహరీ పక్కన చెత్తను కుప్పగా పోయడంతో దోమలు వ్యాపించి అనారోగ్య బారినపడే ప్రమాదం ఉందని విద్యార్థులు వాపోతున్నారు. సోమవారం పాఠశాల తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాఠశాల పరిసరాలు పరిశీలిస్తే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు.

### రోడ్డు విస్తరణ చేపట్టాలి

**పరకాల :** పట్టణంలో ప్రమాదకరంగా మారిన యూటర్న్‌ల వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సుష్మాకు సోమవారం వినతిపత్రం అందించారు. రోడ్డు వెడల్పు లేని చోట యూటర్న్‌లు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు ఢీ కొని పలువురు గాయపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు నిర్మాణం జరుగుతున్న దామెర చెరువు ట్యాంక్ బండ్ యూటర్న్ వద్ద రోడ్డును 30 ఫీట్లకు పెంచాలని కోరారు.

### వ్యక్తి రిమాండ్

**శాయంపేట :** పులుకుర్తి గ్రామానికి చెందిన దుబాసి రంజిత్ ఓ కేసులో కోర్టుకు సరిగా హాజరుకాకపోవడంతో పరకాల మేజిస్ట్రేట్ శాలిని లింగం సోమవారం పరకాల సబ్ జైలుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. గతంలో రంజిత్ గొడవ పడిన కేసులో వారెంట్ రాగా పరకాల కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కాగా అతడు కోర్టుకు హాజరు కాకపోవడంతో పరకాల మేజిస్ట్రేట్ శాలిని లింగం ఈనెల 28 వరకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ప్రమాదవశాత్తు గడ్డికట్టలు దగ్ధం

**వేలేరు :** మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు బాబురావు తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో పాడి మేత కోసం వరిగడ్డిని కట్టలుగా చుట్టి నిల్వ చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున గడ్డికట్టలకు మంటలు అంటుకుని కాలుతుండటంతో గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**శాయంపేట :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన అడిదల బుచ్చిరెడ్డికి మంజూరైన రూ.92 వేల విలువచేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును సోమవారం అందించినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏరుకొండ శంకర్ తెలిపారు. బుచ్చిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడని, ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావును కోరగా ఎమ్మెల్యే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కు మంజూరు చేసినట్లు తెలిపారు.

# ఆకతాయిలకు అడ్డాగా ‘డబుల్’ ఇళ్లు



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన డబుల్ బెడ్రూం ఇళ్లు



డబుల్ బెడ్రూం ఇళ్లలో తాగి పడేసిన మద్యం సీసాలు

- పేకాట, మద్యం, గంజాయి సేవిస్తున్న మందుబాబులు
- మత్తులో కిటికీల అద్దాలు ధ్వంసం
- పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికుల విజ్ఞప్తి



డబుల్ బెడ్రూంలో తాగి పడేసిన సిగరెట్ పీకలు



పగిలిన డబుల్ బెడ్రూం ఇళ్ల కిటికీల అద్దాలు

**కమలాపూర్ :** మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఆకతాయిలు నిత్యం మద్యం సేవిస్తూ పేకాడుతున్నారు. మద్యం మత్తులో డబుల్ బెడ్రూం ఇళ్ల కిటికీలను ధ్వంసం చేస్తున్నారు. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్ల వైపు నుంచి వెళ్లాలంటేనే స్థానికులు భయాందోళ చెందుతున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల వైపు స్థానిక పోలీస్‌లు నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

**320 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం**

ఇళ్లు లేని నిరుపేదల కోసం 2018లో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతూ హుజూరాబాద్ ఉప ఎన్నికల తర్వాత ఎట్టకేలకు పూర్తయ్యాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్లు, విద్యుత్, వాటర్ వంటి మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో ఆ డబుల్ బెడ్రూంలు నిరుపయోగంగా మారాయి.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. సుమారు మూడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది కార్మికులు బతుకుదెరువు కోసం కమలాపూర్‌కు వలస వచ్చారు. వారు ఉండేందుకు ఇళ్లు దొరక్క, అద్దె చెల్లించే స్తోమత లేక ఖాళీగా ఉన్న కొన్ని డబుల్ బెడ్రూం ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఖాళీగా ఉన్న మరి కొన్ని డబుల్ బెడ్రూం ఇళ్లను ఇంకొందరు తమ స్థావరాలుగా మార్చుకుని అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

**మద్యం మత్తులో కిటికీలు ధ్వంసం..**

నిరుపయోగంగా ఉన్న కొన్ని డబుల్ బెడ్రూం ఇళ్లలో కొందరు నిత్యం మద్యం, గంజాయి సేవిస్తూ పేకాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో అక్కడే మల, మూత్ర విసర్జన చేయడంతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్ల కిటికీల అద్దాలు ధ్వంసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి



నిరుపయోగంగా ఉంటున్న డబుల్ బెడ్రూం ఇళ్లలో పలువురు గుర్తు తెలియని వ్యక్తులు పేకాడుతూ సిగరెట్లు, మద్యం, గంజాయి సేవిస్తున్నారు. మద్యం మత్తులో ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారు. పోలీస్‌లు డబుల్ బెడ్రూం ఇళ్ల వైపు ప్రత్యేక నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి. లేదంటే యువత చెడిపోయే ప్రమాదం ఉంది.

– పుల్ల కుమార్, స్థానికుడు

### నిరుపేదలకు ఇళ్లు పంపిణీ చేయాలి



ఇళ్లు లేని నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లల్లో వెంటనే మౌలిక వసతులు కల్పించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలి. ఎందరో నిరుపేదలు అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని పంపిణీ చేయకుండా ఇంకా జాప్యం చేయడం సరికాదు. ఇప్పటికే డబుల్ బెడ్రూం ఇళ్ల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి.

– జక్కు రాజుగౌడ్, స్థానికుడు

# మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు

**ఐనవోలు :** మల్లికార్జునస్వామిని స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి–వినయరాణి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. శ్రీహరి దంపతుల పెళ్లిరోజు కావడంతో ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకుడు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు శ్రీహరి దంపతులకు అందించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ, నందనం మధుశర్మ, ఉప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సైగా ప్రవీణ్‌కుమార్



**ఎల్కతుర్తి :** ఎస్సైగా ఎ. ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చెపట్టనున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై గోదారి రాజ్‌కుమార్ అవినీతి ఆరోపనలు ఎదుర్కొని సస్పెండ్ కాగా ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్ బదిలీపై రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వరంగల్ సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్నారు.

### సన్నాహక ప్రదర్శనకు తరలిన నాయకులు

**కమలాపూర్ / దామెర:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వేల గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శనలో భాగంగా హనుమకొండలో సోమవారం నిర్వహించిన సన్నాహక ప్రదర్శనకు కమలాపూర్, దామెర మండలాల నుంచి డప్పు కళాకారులతో కలిసి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పెద్దెత్తున తరలివెళ్లారు. బస్టాండ్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు డప్పులు దరువేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి బయలుదేరారు.

### పరామర్శ

**ఐనవోలు :** మండలంలోని పంథిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు ఉప్పునూతల సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే కేసులు

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



పట్టుకున్న గుట్కాలు, పాన్ మసాలాలు చూపుతున్న పోలీసులు

**కమలాపూర్ :** మత్తు పదార్థాలైన గుట్కా, అంబర్, పాన్‌మసాలా ప్యాకెట్లను విక్రయిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. మండలంలోని అంబాలలో విక్రయిస్తున్న గుట్కా, పాన్ మసాలాను సోమవారం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబాలలోని కిరాణాల్లో గుట్కాలు, పాన్ మసాలాలు అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పఠాన్ బడేసాబ్, దొడ్డిపాటి పోచయ్యకు చెందిన రెండు కిరాణాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో పఠాన్ బడేసాబ్‌కు చెందిన కిరాణంలో రూ.4,175, దొడ్డిపాటి పోచయ్యకు చెందిన కిరాణంలో రూ.4,005 విలువచేసే గుట్కాలు, పాన్ మసాలాలు లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని పఠాన్ బడేసాబ్, దొడ్డిపాటి పోచయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# గ్రామసభలను వినియోగించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ
- నేటి నుంచి గ్రామ సభలు ప్రారంభం

**పరకాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టనున్న ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా నిర్వహించే గ్రామసభలను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె సోమవారం గ్రామ సభల వివరాలను వెల్లడించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ అమలు కోసం ప్రభుత్వం విధివిధానాలు రూపొందించి గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 5,6,7,8,18,19 వార్డులకు కొత్త మున్సిపల్ కార్యాలయ ఆవరణం సభలో ఉంటుందని, 22వ తేదీన 3,4,15,16,17,22 వార్డులకు ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఆవరణలో, 23న 1,2,12,13,14 వార్డులకు సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల ఆవరణలో, 24వ తేదీన 9,10,11,21 వార్డులకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబితాలో పేరులేనివారు నిబంధన మేరకు సంబంధిత పత్రాల జిరాక్స్‌లను దరకాస్తులకు జతపరిచి మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుష్మా పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వం నాలుగు పథకాల అమలు కోసం నేటి నుంచి చేపట్టనున్న గ్రామ సభలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. ఈనెల 21వ తేదీన ఉదయం 10.30 గంటలకు అలియాబాద్, మల్లక్‌పేట, హైబోత్‌పల్లి, మధ్యాహ్నం 2గంటలకు లక్ష్మీపూర్, 22న ఉదయం 10.30 గంటలకు పోచారం, వెంకటాపూర్ మధ్యాహ్నం 2గంటలకు కామారెడ్డిపల్లి, పైడిపల్లి గ్రామాల్లో, 23న ఉదయం 10.30 గంటలకు నాగారం, వెల్లంపల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు గ్రామ సభలను వినియోగించుకోవాలని కోరారు.

**దామెర :** మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. అందులో భాగంగా ఈనెల 21 ఉయదం 9 గంటలకు ల్యాదెళ్ల, ఒగ్లాపూర్, పసరగొండ, మధ్యాహ్నం 2 గటంలకు ముస్త్యాలపల్లి, ఊరుగొండ, 22న ఉదయం దామెర, దమ్మన్నపేట్, తక్కళ్లపహాడ్ మధ్యాహ్నం వెంకటాపూర్, 23న ఉదయం కోగిల్వాయి, సింగరాజుపల్లి, పులుకుర్తి, సీతారాంపూర్ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**ఆత్మకూరు :** మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన అగ్రంపహాడ్, అక్కంపేట, హౌజుబుజుర్గు, కామారం, 22న ఆత్మకూరు, చౌళ్లపల్లి, కటాక్షపూర్, లింగమడుగుపల్లి, 23న గూడెప్పాడ్, కొత్తగట్టు, నాగయ్యపల్లి, నీరుకుళ్ల, 24న మల్కపేట, పెద్దాపూర్, పెంచికలపేట, తిరుమలగిరి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు. గ్రామసభకు సంబంధిత అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

**కమలాపూర్‌లో..**

**కమలాపూర్ :** మండలంలోని 24 గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు దేశరాజుపల్లి, గూడూరు, కన్నూరు, శనిగరం గ్రామాల్లో, 22వ తేదీన ఉదయం 10 గంటలకు పంగిడిపల్లి, అంబాల, ఉప్పల్, మర్రిపల్లి గ్రామాల్లో, మధ్యాహ్నం 1 గంటలకు లక్ష్మీపూర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో, 23న ఉదయం 10 గంటలకు కానిపర్తి, నేరెళ్ల, భీంపల్లి, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో, మధ్యాహ్నం 1గంటలకు శంభునిపల్లి, శ్రీరాములపల్లి, ఉప్పులపల్లి గ్రామాల్లో, 24న ఉదయం 10 గంటలకు కమలాపూర్, గూనిపర్తి, గుండేడు, వంగపల్లి గ్రామాల్లో, మధ్యాహ్నం 1 గంటలకు మాదన్నపేట, కొత్తపల్లి, గోపాల్‌పూర్ గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని, ప్రజలు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ కోరారు.

# రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**వేలేరు :** రాష్ట్రంలో రైతులు చేసుకుంటున్న ఆత్మహత్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న హత్యలేనని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారం చేపట్టి తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేశారని విమర్శించారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, రైతులు బ్యాంకుల చుట్టు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి.. దమ్ముంటే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభివృద్ధి కోసం పార్టీ మారలేదని, తన బిడ్డ భవిష్యత్ కోసమే పార్టీ మారాడని మండిపడ్డారు. మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మండల కోఆర్డినేటర్ సురేష్, కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ మనోజ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు నర్సింగరావు, జాని, వీరయ్య, మహేందర్, వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు

**శాయంపేట :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని బహుజన సంక్షేమ సంఘం, దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులను గుర్తించాలని అన్నారు. దళిత సంఘాల నాయకులు సుధాకర్, విజయ్ పాల్గొన్నారు.

**వైన్‌షాపులను తొలగించాలి**

**శాయంపేట :** ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రోడ్డు పక్కన కొనసాగుతున్న మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్, కొప్పుల గ్రామంలో శ్రీ సాయి వైన్స్‌ను తొలగించాలని సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ వినతిపత్రం అందించారు. ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తిరిగే రహదారికి ఆనుకుని వైన్‌షాపులు ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. వెంటనే చర్య తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జశ్వంత్ పాల్గొనారు.

# క్రీడలతో మానసికోల్లాసం



బహుమతితో హౌజుబుజుర్గు క్రికెట్ జట్టు

**ఆత్మకూరు :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అహ్మదీయ ముస్లిం జమాత్ జిల్లా అధ్యక్షుడు లతీఫ్‌షరీఫ్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో సోమవారం అహ్మదీయ ముస్లిం జమాత్ యువకుల సమితి ఆధ్వర్యంలో మసూర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో హౌజ్‌బుజుర్గు టీమ్ విజయం సాధించగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లతీష్ షరీఫ్ మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహాభావం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడలపై దృష్టి సారించి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబ్‌పాషా, మసూద్ అహ్మద్, ఆసీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, మాజీ ఎంపీపీ సుమలత, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్, మండల అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

# దాడి చేసిన దుండగులను శిక్షించాలి



కమలాపూర్ : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



ఐనవోలు : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**కమలాపూర్ :** సంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై గతేడాది డిసెంబర్ 23వ తేదీన దాడికి పాల్పడిన కారకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లోకి కుల, మత పరమైన అంశాలను తీసుకొచ్చి ఉపాధ్యాయులపై అకారణంగా దాడులు చేయడం అధికమైందన్నారు. ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులకు కారకులైన వారిని గుర్తించి శిక్షించి ప్రభుత్వ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఐనవోలు :** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ సోమవారం ఐనవోలు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బీమళ్ల సారయ్య మాట్లాడారు. అయ్యప్ప మాలధారాణ చేసిన విద్యార్థికి హెచ్ఎం కాలు తగిలించాడని ఆయనపై దాడి చేయడం అమానుషన్నారు. విద్యార్థితో పాటు ఇతరులు కాళ్లు మొక్కించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ సంఘటనలో తలదూర్చిన వ్యక్తులందరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని, కుల, మత, వర్గ రహిత కేంద్రాలుగా పాఠశాలలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వేంకటేశ్వరరావు, డీటీఎఫ్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, విజయ, ఆశ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### మధుప్రియకు ప్రశంసపత్రం



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**ధర్మసాగర్ :** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని పోలేపల్లి మధుప్రియ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు ప్రదర్శన పోటీల్లో ‘ఏ లిఫ్ట్ ఫర్ ప్యాడీ బ్యాగ్స్ లోడింగ్’ అనే ప్రాజెక్టు ప్రదర్శన చేసి ప్రశంసాపత్రం సాధించింది. ఇటీవల జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నేషనల్ ఆన్నోవేషన్ ఫౌండేషన్, నేషనల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రశంస పత్రం సాధించింది.

**కుర్చీల బహూకరణ**

**శాయంపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1973–74 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు 8 కుర్చీలను అందించారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరావు అభినందించారు. కుర్చీలు అందించడం సంతోషకరమన్నారు.